# ప్రమోషన్

టంకశాల అశోక్



సమ్మయ్యకు దుఃఖం పొర్లుకొచ్చింది.

గీతా విలాస్‌లో క్లీనర్‌గా మూడేళ్ళ సర్వీసు సమ్మయ్యది.

పని బాగా చేస్తాడని సేటు మెచ్చుకుంటాడు. గిరాకీ ఎంతున్నా సరే పని త్వరత్వరగా చేసుకుపోతాడు. సమ్మయ్య. సామాను కూడా పగలనివ్వడు.

సమ్మయ్య క్లీనర్ పనేకాదు. ప్లేట్లు కడగడం, రాత్రి హోటలు బందయినాక హోటలంతా ఊడ్చి తడిగుడ్డతో తుడవట్టం, గిన్నెలు తోమడం, టవల్సన్నీ ఉతకడం వగైరా ఏ పనైనా సరే—బాగా చేస్తాడని అంతా మెచ్చుకుంటారు అందుకు వాడికి చెప్పలేనంత ఉబ్బు. దానితో అదేపని ఇంకా బాగా చేయాలని తబ్బిబ్బు పడుతుంటాడు.

మరింత బాగాచేస్తే సేటు మరింత మెచ్చుకుంటాడని వాడి ఆశ. అందుకోసం ఎదురు చూస్తుంటాడు. సేటు మెచ్చుకున్నప్పుడు చూడాలి వాణ్ని.

సమ్మయ్య ఊరు శివరాంపల్లి. అక్కడి నుండి పాలుతెచ్చి ఉస్మానియా మెడికల్ కాలేజీ దగ్గర గీతా విలాస్‌కు పోసే రమణయ్య (బర్రెల)కు సమ్మయ్య తండ్రి పచ్చి గడ్డి మోపులేస్తాడు. సమ్మయ్యను ఇక్కడ పనికి కుదిర్చింది రమణయ్యే. అప్పుడు వాడికి తొమ్మిదేళ్ళు ఇప్పుడు పన్నెండు దాటుతున్నాయి. రెండు పూటలా తిండి చాయ్, పొద్దున్న నాస్తా, నెలకు 15 రూపాయల జీతం, రోజుకు 15 పైసల బత్తాతో చేరిన సమ్మయ్య కిప్పుడు, తక్కినవి అలాగే ఉండగా, జీతం 30కి పెరిగింది. బత్తా చారనా అయింది.

ఇట్లా ప్రశాంతంగా సాగిపోతున్న సమ్మయ్య జీవితానికి పది రోజుల క్రితం హఠాత్తుగా సెమీకోలన్ పడింది.

అదే హోటల్‌లో సమ్మయ్య లాగా క్లీనర్‌గా ఉండిన నర్సింలు, నాంపల్లి దగ్గరలో కొత్త హోటల్లో సర్వర్‌గా చేరాడు !

సమ్మయ్య సెమీకోలన్ గురించి ఎప్పుడూ వినలేదు. కాని వాడికి, తన జీవితానికి ఫుల్‌స్టాప్ పడినట్లనిపించింది. వాడికి మనసు మనసులోలేదు. తల పనిచేయలేదు. ఊహించని అవాంతరమేదో ఎదురైనట్లు దిక్కుతోచలేదు.

సమ్మయ్య మరునాడంతా తీవ్రంగా ఆలోచించాడు.

మళ్ళీ మర్నాడు పగలు రెస్టుకోసం పని దిగినప్పుడు సేటు ఇంటికి బయలు దేరాడు.

సమ్మయ్యంటే సేటుకు కాస్త గురి కుదిరినప్పటి నుండి వాడిని అప్పుడప్పుడు ఇంటిపనులు చేయడానికి పంపుతుండేవాడు. సమ్మయ్య అమ్మగారి దగ్గర ఇంకా మంచి పేరు తెచ్చుకొన్నాడు.

తనకు ఎదురైన సమస్యకు పరిష్కారం ఏమిటాని తీవ్రంగా ఆలోచించిన సమ్మయ్యకు అమ్మగారు గట్టిగా కనిపించింది. తాను ఎప్పుడెప్పుడు ఏమేం పనులు ఎంత శ్రద్ధగా చేసిందీ, అందుకు ఆమె తనను ఎట్లా మెచ్చుకొన్నదీ, సేటుతో ఏం చెప్పిందీ— అంతా గుర్తు చేసుకొన్నాడు. అట్లా తిరిగి తిరిగి నెమరు వేసుకొన్నాకొద్దీ వాడికి నమ్మకం పెరిగింది. అమ్మగారు సేటుతో చెప్పి తప్పక తనను కూడా సర్వర్ చేయిస్తుందనుకొన్నాడు.

సేటులేని సమయం చూసి నెమ్మదిగా ఇంటికి వెళ్ళిన సమ్మయ్య ఇవాళ మరింత వినయంగా నమస్కారంపెట్టాడు. ఆ పనులు ఈ పనులు చేసినాక అమ్మగారు వాలుకుర్చీకి కాస్త దూరంగా ఒదిగి నిలబడ్డాడు. చేతులు వెనక్కి చేర్చి వాటినీ, వాటిలో గుండెను బిగబట్టి, మాటల కోసం నేలమీద కాలి బొటన వేలుతో గీసి వెతుకుతూ, చిరుచెమటలు పడుతుండగా ... త డ బ డు తూ, మెల్లగా చెప్పాడా?—

ఆఁ—చెప్పినట్లున్నాడు!

అమ్మగారు పెద్దగా నవ్వేసింది.

సమ్మయ్య బిత్తర పోయాడు.

అదెంత పనిరా చెప్తాను పొమ్మందామె.

సమ్మయ్య హోటల్‌కేసి పరుగెత్తాడు.

అందరికీ చెప్పాడు.

వాడికి మనసు మనసులోలేదు.

మరునాడు పగలు అమ్మగారి దగ్గరకు మధ్య మధ్య ప రి గె డు తూ వెళ్ళాడు సమ్మయ్య. కాని అమ్మగారు సినిమాకు వెళ్ళారు. తెల్లవారి వెళ్ళేసరికి ఆమెఇంకా సేటుకు చెప్పలేదు. మూడవ రోజున మరచి పోయింది. నాల్గవనాడు సేటు పొద్దుపోయి ఇంటికి వచ్చాడు. ఐదవ దినాన వీలు దొరకలేదు. ఆరవరోజున చెప్పింది.

సేటుకు తాను చెప్పానని, కాని వద్దన్నాడని సమ్మయ్యతో చెప్పింది అమ్మగారు.

సమ్మయ్యకు దుఃఖం పొర్లిపొర్లివచ్చింది.

తరువాత రెండు రోజులదాకా వాడు కన్పించక పోవడంతో ఊరంతా వెతికారు.

వెతకగా, వెతకగా, క్లీనర్ పనే మరో చోట చేస్తూ కన్పించాడు సమ్మయ్య. *